


# 1

"ఔను కామాక్షీ! ఈ రామాపుర సంబంధమే అన్ని విధాల మంచిది. పిల్లవి నచ్చుకుంటేముహూర్తం తొందరగా పెట్టించేసి పెళ్ళి చేసేయాలి. వాళ్లకూడా తొందరపడ్తున్నారు."

"మరి అమ్మాయిని అడగవద్దుటండీ?"

"అడగడానికి ఏముంది? మన మాట కాదంటుందా? అయినా పెళ్ళిచూపులు యింకా వున్నాయాయెను..."

"ఎపుడు?"

"బుధవారం - రేపే! సాయంత్రం 4-28 ని॥లకు మంచిదని - అపుడే వస్తామని వ్రాశారు మనసూర్యారావుకి."

"అదికాదండీ - అమ్మాయి పి. యు. సి. చదువుతానంటోంది."

"ఇంకా చదువుతుందా? వద్దు. ఈ ఒక్కవిషయంలో నా మాట వినమని చెప్పు. పెళ్ళి అయ్యాక దాని మొగుడు చదువుకోనిస్తే చదువుకోమను."

బయట తలుపుదగ్గర నిలబడి యివన్నీ వింటున్నది పద్మ. ఇహ తను ప్రవేశించకపోతే అంతా తారుమారైపోతుందని గదిలోకి వెళ్ళింది.

"ఏం నాన్నగారూ! నన్ను చదువుకోనివ్వరూ?" అని జాలిగా అడిగింది.

"ఓ-నువ్వంతా విన్నావన్నమాట! నా మాట వినమ్మా. పైచదువులు మన కనవసరం" అన్నారు రాఘవరావుగారు.

"ఎందుకని?" అని ప్రశ్నించింది - 'స్త్రీ విద్య అవసరం' అని వాదించి డిబేటులో ప్రథమ బహుమతి పొందిన పద్మ.

"ఇపుడు నీకు చెప్పినా అర్థంకాదు - కామాక్షీ! వెళ్లు - పద్మని తీసుకెళ్లు."

"వుండమ్మా!" అని తనను పిలవబోతున్న కామాక్షమ్మతో అని - "అదికాదు నాన్నగారూ. మా క్లాసుమేట్సు ఎంతోమంది పి. యు. సి. చదువుతారు. నేను చదవద్దేమిటి. నేను లేడీ డాక్టర్ని అవుదామనుకుంటుంటే!" ఇక ఆగలేక ఏడ్చేస్తున్నదిపద్మ!

రాఘవరావుగారు దగ్గరగా వెళ్ళి ఓదార్చేరు. "చూడమ్మా! ఎప్పటికయినా స్త్రీకి వివాహం అవసరం. అది ఎపుడు చేయాలో తల్లిదండ్రులకు బాగా తెలుసు. నా మాట విను, వెళ్లు."

ఆరాత్రి పద్మ పడుకున్నదే కాని నిద్రపట్టలేదు. ఆలోచనలు మనస్సుకు విశ్రాంతి నివ్వలేదు. 'నా చదువుకు యిహ స్వస్తేనన్నమాట' అనుకుంది పద్మ. "నీకేం అమ్మా! నువ్వంటే మీ యింట్లో గారం. నీ మాటకెదురులేదు. నువ్వు పి. యు. సి.

ఏమిటి — యింకేమన్నా చదువగలవు" అన్న కళ్యాణి మాటలు వెక్కిరి-పుగా తోచాయి. చిన్నపుడు చదువనూ అని మారాంచేస్తే బలవంతాన బడికి పంపించేవారు — యిప్పుడు చదువుతానూ అంటే వద్దంటున్నారు. ఏమిటోమరి. ఇంతకీ వీళ్ళ ఉద్దేశ్యం ఏమిటో? నాకు యిప్పట్నించి పెళ్ళేమిటి వచ్చేపటికి నేనూ చంకగోసిల్ల-టిప్‌మని ఆ మొగుడిగాడి అడుగుజాడల్లో నడుచుకోవాలిట — అతను నవ్వితే తను నవ్వాలిట. లేకపోతే పతివ్రతలు కాలేరుట. అతను సీరియస్‌గా వుంటే తనూ వుండాలిట. అంటే యిన్‌సింపుల్ వర్డ్స్ - తను అతను చేతిలో కీలుబొమ్మ అయిపోవాలి. ఆ వచ్చినవాడు సంస్కారం వున్న మనిషయితే ఫరవాలేదు, అయినా చదువుకున్న వారిలోనే కన్పడని ఈ పదం యింకెవరిలోనో ఎందుకు కన్పడుతుంది? ఇహ తను స్వేచ్ఛగా వుండలేదన్నమాట" ఈ ఆలోచన రాగానే పద్మ మనసు కలవరపడ సాగింది. గడియారం రెండుకొట్టింది. ఆలోచనలు ఆపి విశ్రాంతికై గట్టిగా కళ్ళు మూసుకుంది పద్మ.

తెల్లవారింది. బుధవారం వచ్చేసింది. రోజులాగే టైముకూడా నడిచింది. మధ్యాహ్నం భోజనాలయ్యాక పద్మ పుస్తకంతో సహా నిద్రపోయింది. కామాక్షమ్మ వచ్చి లేపేవరకు తెలివి రాలేదు. "టైమెంతమ్మా!" అని ఆవులిస్తూ ప్రశ్నించింది.

"నాలుగ్గంటలయింది, లే-లేచి ముఖంకడుక్కు-నీ కాఫీ తాగుదువు గాని..." అని అక్కడనుండి వెళ్ళిపోయింది కామాక్షమ్మ.

పద్మకు ఏదో జ్ఞాపకం వచ్చింది. "మరి-?" అని కామాక్షమ్మ లేకపోవడం చూసి ఆగిపోయింది. కాఫీ త్రాగుతుంటే కామాక్షమ్మే అంతా చెప్పింది ...'శలవు దొరకలేదుట పెళ్ళికొడుక్కి- అందుకు యివాళ్టికి రాలేదు. ఆదివారం సాయంత్రానికి వస్తారు. అని. అంతటితో ఆగలేదు. "శనివారం ఒంటిప్రొద్దు చెయ్యి. వెంకటరమణమూర్తి కోవెలకు వెళ్ళు.వెళ్ళి......"

మధ్యలోనే అందుకుంది పద్మ-'హారతియియ్యి' -'ఏంటమ్మా.' యివాళ కొత్తగా చెపుతున్నావు. అయినా ఈ వారం మానేస్తే దేవుడికి కోపం వచ్చి పెళ్ళివార్ని రానీకుండా చేస్తాడా?' నవ్వుకుంటూ లేచి వెళ్ళి అక్కడనుండి వెళ్ళిపోయింది పద్మ.

ఆ శనివారం యిట్టే వచ్చేసింది స్నానం వగైరా అయ్యాక పూలసజ్జతో కామాక్షమ్మకు చెప్పి బయలుదేరింది పద్మ కోవెలకు. కామాక్షమ్మ అలా కూతురువేపు చూస్తూ-'మా బంగారు తల్లి! లక్ష్మీ దేవిలా వుంటుంది. ఆ శ్రీనివాసుడి దయవల్ల ఈ సంబంధం స్థిరపడిపోయిందా-చాలు!" అని తనలో అనుకుంటూ నిలబడి పోయింది.

దూరం నుంచి 'ఏడుకొండలస్వామీ - ఎక్కడున్నావయ్యా' అని ఘంటసాల పాట శ్రావ్యంగా విన్పిస్తున్నది. కోవెలలో. ఉదయమే సుప్రభాతం అయ్యాక ఈ పాటలు వెయ్యడం అలవాటు. పద్మ తొందరగా కోవెలకు చేరుకుంది. కాళ్లు కడుక్కున్నాక ప్రదక్షిణలు పూర్తిచేసి గర్భ గుడిలోనికి చేరుకుంది.

ఇహ లోకానికి ప్రత్యక్ష దైవం! ఆరాధించే వాళ్ళకు కమనీయమూర్తి! కోరుకునే వాళ్ళకు వరాల దైవం — వెంకటేశ్వరుల వారు! ఆ స్వామికి నమస్కరించింది — వేడుకుంది పద్మ — అన్నింటికీ చిరునవ్వుతో "రేపు నీకు శుభం" అని ఆయన అన్నట్టు ఫీలయింది.

బయటకువచ్చి మండపంమీద కూర్చుంది. విశాలంగా వుందా మండపం. అలంకరణలు కూడా వున్నాయి. "అవును త్యాగరాజు వుత్సవాలు కదూ" అని అనుకుంది పద్మ — వెంటనే నవ్వుకుంది కూడా! ఏమంటే త్యాగరాజు భక్తులు వారిలో వారికే పడక రెండు సమితులుగా అయి స్వామిని కొలవడం-దీని మూలాన ప్రతీ సంవత్సరం రెండు వుత్సవాలు జరగడం "వేటిలోనూ మానవులకు పొత్తులేదు. దైవారాధనలో కూడా! తెలుగు మాష్టారు-పిలక జ్ఞాపకం వచ్చేరు పద్మకు, అవును ఆయన చెప్పినట్లు రెండు సమితులు త్యాగరాజుని కొలవడమే చేస్తున్నారు — కాని యిరువురు ఒకటిగా కాదు" ఆలోచనలు ఆపి లేచి బయల్దేరింది పద్మ. కోవెలలో కొంచెం రద్దీ ఎక్కువవుతున్నది. "ఈ శనివారం వస్తే చాలు బాబూ-దైవారాధనకు కొందరు-దేవీ ఆరాధనకు కొందరు రెడీ-యింకా నయం. ఉదయమే వచ్చాను, ఇదే సాయంత్రం అవుతేనా"అని తనలో తాను అనుకుంటూ వడివడిగా నడుచుకుని యిల్లు చేరుకుంది.

— వెంకటేశ్వర్లవారి దీవన సత్యమైంది. సంబంధం నిశ్చయమైంది. పద్మ మెళ్ళో మూడు ముళ్ళూ (తొమ్మిది కాదు-మంగళ సూత్రం)పడ్డాయి.

బాధగా చూసింది పద్మ - కామాక్షమ్మ వేపు వూరికి వెళ్ళిపోతూ!

వంగి నమస్కరిస్తున్న పద్మను లేవదీస్తూ-"చూడమ్మా! నువ్వలా బెంగపెట్టుకోకు. రోజూ ఉత్తరం రాస్తూవుండు. ఇన్నాళ్ళు నువ్వెలావున్నా ఏమన్నా ఫరవాలేకపోయింది. అల్లుడి మనసు తెలుసుకొని నడుచుకోవాలి యిహమీదట- అర్ధమయిందా?" అని బోధలు చెప్పింది కామాక్షమ్మ.

పెళ్ళంటే పూర్వపు ఆలోచనలు జ్ఞాపకమొచ్చాయి పద్మకు. 'ఆ మొగుడి అడుగుజాడల్లో నడుచుకోవాలి- నవ్వుకుంది పద్మ. వాళ్ళ వెర్రిగాని ఒకరి అడుగుజాడల్లో ఇంకొకరు నడుచుకోవడమేమిటి?' అనుకుంది పద్మ మనసులో.

'ఫరవాలేదు నేను అంతా చెప్పేశాను.- అల్లుడితో పైగా అతను చాలా ఓర్మిపరుడు. మనపెంకి పిల్లను దార్లోకి తెస్తాడు' అన్నాడు రాఘవరావు గారు నవ్వుతూ.

కాని పద్మ అత్తవారింటికివెళ్ళినా (అత్తగారు లేదు. అయినా ఈ పదం వాడటం అలవాటు) ఇంకా చిన్నతనం చిలిపితనం విడిచిపెట్టలేదు. అత్తగారు- ప్రిఫర్‌బ్లీ- సూర్యకాంతంలాంటి ఆవిడ వుండివుంటే ఏమయి వుండేదో?

మొదట్లో తన భార్యతీరుచూసి ఆశ్చర్యపడ్డాడు. మోహన్. "సమాన హక్కులకోసం-హోరాహోరీ పోరాటం". అదేదో సినిమాలో ఆరుద్ర పాట జ్ఞాపకంవచ్చింది మోహన్‌కు. తన భార్య తరహా గమనించాక.

మోహన్ మంచివాడే. పువ్వులా చూసుకుంటాడు పద్మను. కాని పద్మే ముల్లులా ప్రవర్తిస్తుంటుంది.

ఆవేళ మోహన్ ఆఫీసునుంచి వచ్చి ఉత్సాహంగా అన్నాడు- 'పద్దూ- యివాళ మీ నాన్నగారి దగ్గరనుండి ఉత్తరం వచ్చింది.


"ఊఁ హూఁ" అని వూరకుంది పద్మ చేతిలోని పుస్తకం పేజీ త్రిప్పుతూ.

మోహన్ మనస్సు చివుక్కుమంది. అయినా యింకా వుత్సాహంతో — "అవును పద్మా! నిన్ను వదలి వుండలేకపోతున్నారుట - అందుకని ఒక నెల్లాళ్ళపాటు పంపమని వ్రాశారు" అన్నాడు.

ఈమారు పుస్తకం మడిచింది పద్మ-'అలాగా! అయితే యివాళ సాయంత్రమే బయల్దేరుతాను' అంది ఆనందంగా. వెళ్ళనంటుందేమోనని తనని వదలి వుండలేను అంటుందేమోనని అనుకున్నాడు -కానీ?

'సరే చూద్దాం' అని అక్కణ్నుంచి వెళ్ళిపోయాడు- వీలుచూసి పంపిస్తానని మామగార్కి-వుత్తరం రాసి పోస్టుచేసి వచ్చాడు మోహన్-

రాత్రి భోజనంచేసి ఈ విషయమే చెప్పాడు



డిజైన్: వెల్లటూరి పూర్ణానందశర్మ.

పద్మ కోపంగా చూసింది - "ఆయన పంపమని వ్రాస్తే వీలు చూసుకుని పంపిస్తానని వ్రాశారా? బావుంది - యింకా ఇవాళో రేపో పంపిస్తానని వ్రాశారనుకున్నాను."

మోహన్ శాంతంగా నవ్వుతూ చెప్పాడు - "వాళ్ళంటే పంపమని వ్రాశారు కాని - మరి-మరి" పద్మవేపు చూస్తూ అన్నాడు.

"మరి?"

కటువుగా వచ్చిన ఈ ప్రశ్నకు జవాబు చెప్ప దలుచుకోలేదు మోహన్. లేకపోతే - "మరి నేను నిన్ను వదిలి ఎలా వుండగలను?" అని చెప్పే వాడే!

మోహన్ పద్మ వింత ప్రవర్తనకు విస్తు పోతూండేవాడు. వెంటనే "చిన్నపిల్ల! మాట తీరు తెలీదు. లోకజ్ఞానం యింకా కావాలి" అని సరి పెట్టుకొనేవాడు.

ప్రయివేటుగా పి. యు. సి కడుతున్నది పద్మ. అందుకే పుస్తకాలతో స్నేహం. ఫారాలన్నీ తనే స్వయంగా వ్రాసి తెప్పించుకుంది. బహుశా చదువుమీదవున్న శ్రద్ధవల్లనేమో పద్మ మోహన్‌పై అశ్రద్ధ చూపుతున్నది.

ఒకసారి మోహన్ అడిగాడుకూడా - "ఇదిగో పద్మూ! నీకిపుడు పి యు సి. ఎందుకు?"

"ప్యాసు అవడానికి" నవ్వుతూ చెప్పింది పద్మ.

"అది కాదు నా వుద్దేశ్యం, నువ్వు చదివి ఉద్యోగాలు చెయ్యాలా — పాడా! అనవసరం కదా అని" సలహా యిచ్చినట్టుగా అన్నాడు.

"ఉద్యోగం చెయ్యాలంటేనే చదువుతారా ఏమిటి. అయినా నాకు చదవాలని వుంది - నేను చదువుతాను" అంది పద్మ నా యిష్టానికి అడ్డేమి టన్నట్టు.

శాంతంగానే మళ్లి అడిగాడు మోహన్ "అయితే ఎస్. ఎస్. ఎల్. సి.తో ఆపేశావేం. పి. యు సి. కంటిన్యూ చెయ్యకుండా."

"నాన్నగారువద్దన్నారు. యిపుడు మీరుఅడ్డయితే నేను భరించలేను."

"నువ్వు చదవటం నాకు అయిష్టమని కాదు నాకూ గర్వమే. నా భార్య ఫలానావరకు చదివిందని చెప్పడానికి! కాని — అలసి సొలసి యింటికి వచ్చేక భార్య నుండి ఏదో ఆప్యాయత, అను రాగం, యివన్నీ భర్త అనేవాడు కోరుకుంటాడు అవి-నీ చదువువల్ల నాకు లభ్యం కావటం లేదు."

"ఫరవా లేదు" తేలికగా అంది పద్మ.

"అని నువ్వు సుళువుగా చెప్పగలవు" భారంగా అన్నాడు మోహన్.

"ఇంతకూ మీరనేదేమిటి?" త్రెంచినట్టుగా మాట్లాడింది పద్మ.

మోహన్‌లో సహనం సడలడం ప్రారం భించింది.

"నువ్వు చదువు ఆపాలి" తన నిర్ణయాన్ని తెలిపాడు.

"ఎందుకేమిటి? నేను చదువుతాను" చిన్నపిల్ల మాదిరిగా అంది.

'నాకు ఆనందం యివ్వని చదువు నీకెందుకు?' మళ్ళీ నచ్చచెప్పే ధోరణిలో అన్నాడు.

'నాకు ఆనందం వుంది' మళ్ళీ చిన్నపిల్ల మాది రిగా అంది.

చిరాకుగా చూశాడు భార్యవేపు 'బహుశా నిన్ను మీ యింట్లో ముద్దుగా పెంచడం వల్లనేమో ఎలా మాట్లాడాలో నీకు తెలియడం లేదు. నా మాటను నిర్లక్ష్యం చేస్తున్నావు" వద్దు సుమా - అన్న చెప్పేడు మోహన్.

ఈమారు చిన్నపిల్లలా కాదు, గారాబంగా పెరిగిన పద్మలా చెప్పింది జవాబు "అని మీరనుకుంటే నే నేమి చెప్పగలను? కాని ఒక్క సంగతి మాత్రం వినండి. నాకు ఎవరేనా అధికృత, సుపీరి యార్టీ-చూపిస్తే మహా కోపం. నేను భరించ లేను."

"నేను నీ భర్తను- ఆ హక్కు నాకుంది"

"నే నది భరించ లేను."

ఇహ మోహన్‌లో సహనం లేదు. అడగ వలసిన ప్రశ్నే అడిగాడు "అయితే పెళ్ళి ఎందుకు చేసుకున్నావ్? పెళ్ళి మానేసి చదువుకోలేక పోయావా?" ఈ ప్రశ్నకు కూడా మామూలు గానే చెప్పింది జవాబు.

'చదువుతాననే అన్నాను. పెళ్ళి వద్దనే అన్నాను. కాని నాన్నగారు బలవంతాన పెళ్ళి చేశారు.

అయోమయంగా చూశాడు పద్మను.

"ఏమిటి? బలవంతాన-చేశారా? నీకిష్టంలేదూ?"

మౌనంగా వూరుకుంది పద్మ.

మోహన్‌లోని ఆవేశం పెల్లుబికింది.

"సరే-అయినా యిష్టమో, నష్టమో కలిసి అగ్ని దేవుని ఎదుట ఏడు అడుగులు నడిచేము. జీవి తాంతం అన్యోన్యంగా కలిసి వుందామని ఒకరి కొకరు మౌనంగా ప్రమాణం చేసుకున్నాము."

"ఇది ప్రతీ దంపతులు చేసేపని-మన ప్రత్యేకత ఏమిటి?"

"ఇలా అనర్థంగా - అశాంతిగా జీవించడమే మనలో ఎన్నదగ్గ ప్రత్యేకత పద్మా."

"అయివుంటుంది."

"నువ్వు యిలా మాటకు మాట జవాబు చెప్పడం చాలాతప్పు. మనిషికి విలువ ఎలా యివ్వాలో తెలుసుకుని మాట్లాడ్డం నేర్చుకో" అన్నాడు మోహన్.


ఈ మాటకూడా తేలికగా తీసుకుంది పద్మ. అందుకే "మీరే నేర్పాలి" అంది నవ్వుతూ.

మోహన్ పిడికిలి బిగించాడు "నేర్పుతాను తప్పకుండా నేర్పుతాను. నా భార్యకు ఎలానేర్పాలో నాకు తెలుసుకూడా."

అక్కడితో మాటలాపి డాబామీదకు పోయాడు మోహన్. "మా పెంకిపిల్లను ఎలాదార్లోకి తెచ్చు కుంటావో" నవ్వుతూ అన్న మామగారి మాటలు జ్ఞాపకం వచ్చాయి. మనసంతా చిరాకుగా వుంది. సిగరెట్టు ముట్టించి తీవ్రంగా ఆలోచించడం ప్రారంభించేడు

— ఏమయినా నా విలువ తెలిసేటట్లు చేయాలి. చేస్తాను." అని తీవ్రంగా ఆలోచించి ఒక నిర్ణ యానికి వచ్చాడు. సరస. సామ, దాన, భేద దండోపాయాలు పనులు సానుకూలం చేసుకోడాన్కి అవసరం. కాని యిక్కడయివన్నీ కాక మరొకటి- క్రొత్తది-అవసరం. అదే ఆలోచించాడు మోహన్.

ఆ మర్నాడు రాత్రి నిర్ణయం ప్రకారం- మధ్యాహ్నం బండికి ప్రయాణం కమ్మన్నాను.



ఉదయం కాఫీ కలుపుతున్న పద్మతో: కొన్ని సెకన్ల పాటు ఆలోచించింది పద్మ- "నాన్నగారు పంపమని రాశారుగదూ- మర్నేపోయా, బట్టలు సర్దుకుంటా. "బండి ఎన్నిగంటలకు."

అదోలా చూచారు పద్మవేపు- మౌనంగా ధారంగా ఆలోచించారు.

పద్మను ట్రైనెక్కి సాగనంపి, తను తన లాయరు స్నేహితుడింటికి వెళ్ళాడు.

రాఘవరావుగారు, కామాక్షమ్మ కూతుర్ని చూసి ఆనందపడిపోయారు. మురిసిపోయారు. పంపినందుకు అల్లుణ్ణి మెచ్చుకున్నారు.

వచ్చి రెండు రోజులయిందిగానీ పద్మ క్షేమంగా చేరినట్టయినా భర్తకు వుత్తరం వ్రాయలేదు- రాఘవరావుగారు మాత్రం వ్రాశారు. తనెందుకు వ్రాయాలి? అతనేముందు వ్రాయనీ- "పద్దూ! క్షేమంగా చేరినట్టుతెలిసి సంతోషించాను. నువ్వు మంచిదానివి. నువ్వు ఎపుడు వస్తావు. ఎదురు చూస్తుంటాను. నీవులేనిదే నా జీవితం నిష్ఫలితం. ఏకాంతం నేను భరించలేను." అని వ్రాయనీ అనుకుంటూ మౌనంగా వూరుకుంది పద్మ. ఉత్తరం వ్రాయకుండా ఆమె అనుకున్న ప్రకారం అతనివద్దన్నుండి వుత్తరం వచ్చింది. గదిలోకి వెళ్ళి కవరు చింపి చదువుకుందా వుత్తరం. పద్మ ముఖంలో తెలుపూ గల విభిన్న—సప్తమ—రంగులు కనబడుతున్నాయి. అయోమయంగా వుందా వుత్తరం. "ప్రేమ మాట ఒక్కటీ లేదు" అనుకుంది - మళ్ళీ చదువబోయిందా వుత్తరం.

"అమ్మా! పద్మా నీకోసం కళ్యాణి వచ్చిందే" అన్న మాటలు వినబడేసరికి వుత్తరం మడిచి జాకెట్టులో పెట్టుకుని - "రావే కళ్యాణీ!" అని బిగ్గరగా అరిచి, గదిలోకి వచ్చిన స్నేహితురాలు కళ్యాణిని మంచంమీద కూర్చోపెట్టింది పద్మ.

"ఉత్తరమైనా వ్రాయకుండా వచ్చేశావ్. ఇంకా విన్ననే అడిగాను మీ యింట నీ విషయమై" అంది పద్మ కళ్యాణివేపు చూస్తూ.

"అనుకోకుండా అయిందీ ప్రయాణం" అంది కళ్యాణి నవ్వుతూ. కులాసా ప్రశ్నలు వేసుకున్నారిద్దరూ.

"అది సరేగానీ - యింతకూ అసలు విషయం చెప్పేవు కాదు. మీ ఆయన..." కుతూహలంగా అడిగింది వివరాలు తెలుసుకుందామని పద్మ.

"వ్రాసిన వుత్తరానికి జవాబేనా వ్రాసే ఓపిక లేదుగాని నేను అన్నీ చెప్పాలేం."

"నీకు తెలియదు కళ్యాణీ-నేను రోజూ వ్రాద్దామనే అనుకొనేదాన్ని - కాని ఏదో అలా రోజూ గడిచిపోయేది-మరి చెప్పు నీ సంగతి?"

"నా సంగతి కన్నా నీగురించి తెలుసుకోవాలని చాలా ఉత్సాహంగా వుంది. ఏమంటే నువ్వొక-అదొక రకమైన ఆలోచనలు, ఆశయాలు వున్నదానివి. నీ సంగతి ఎలా వుంది?"

"చెప్పను-ముందు నువ్వు చెప్పు."

నవ్వుతూ అంది కళ్యాణి "ఏముందీ-మొదట్లో బిడియంగానే వుండి పనీపాటా చేసుకునేదాన్ని-తీరుబాటు అయినపుడు అత్తగార్కి భగవద్గీత చదివి వినిపిస్తుండే దాన్ని. ఆయనే రెండు, మూడు

# ఆసక్తిగొలిపే అద్భుతాలు

## పది శతాబ్దాలనాటి చదరంగ బలం!


మధ్య యుగాలనాటి ఆర్మీనియా ముఖ్య పట్నమైన ద్విన్‌లో యిటీవల పురావస్తు తత్వ శాస్త్రజ్ఞులు జరిపిన త్రవ్వకాలలో పది శతాబ్దాల నాటి చదరంగ బలం బయట పడింది.

రాతి ముక్కలలో జంతు రూపాలలో చెక్కబడిన ఆ చదరంగం పిక్కలు మామూలు చదరంగం పిక్కలకన్న సైజులో పెద్దగా వున్నాయి. నగర మధ్యంలోగల కోటలో జరిగిన త్రవ్వకాల్లో యీ చదరంగం పిక్కలు బయటపడ్డాయి.

ఆర్మీనియాలో పది శతాబ్దాలనాడే చదరంగం ఆట అమల్లో వుందన్న కొందరి వాదం యిప్పటికి రుజువైంది.

## అనంతకోటి జీవులు

ఈ ప్రపంచంలో ఎన్ని కోట్ల క్రిములు, సస్తన జంతువులు ఉన్నాయో ఊహించడానికి మీరెప్పుడైనా ప్రయత్నించారా? జంతు శాస్త్రజ్ఞులు మటుకు యిందుకు ప్రయత్నించి కొన్ని సత్యాలు కనుగొన్నారు. భూమిపై సుమారు



పదిలక్షల రకాల క్రిములు, 80 000 వివిధ జాతుల నత్తలు, 27,000 రకాల సాలీళ్ళు, 8,500 జాతుల పక్షులు, 3 500 వేర్వేరు జాతుల సస్తన జంతువులు ఉన్నాయని వారు అంచనా వేశారు!

## రమ్మంటే దిగే వర్షం!

ఒక్కొక్క మారు వేలాది చదరపుమైళ్ళ విస్తీర్ణంగల అరణ్యాల్లో అగ్ని ప్రమాదాలు సంభవించి, కోట్ల విలువచేసే కలప అపారమైన జంతుసంపద నాశనమైపోతూ వుంటుంది. అటువంటి సమయాల్లో ఎన్ని ఫైర్ ఇంజన్లు పెట్టి తంటాలు పడితేమాత్రం ఫలిత మేముంటుంది!!

అలాంటప్పుడు అక్కడ కృత్రిమ వర్షాన్ని కురిపించగలిగితే ప్రమాదం నివారింపబడుతుంది కదా అని శాస్త్రజ్ఞులు చాలాకాలంగా ఆలోచిస్తున్నారు.

ఇటీవల సోవియట్ సైబీరియా రాష్ట్రంలోని బుగుదాన్ జిల్లాలో టైగా అరణ్యంలో యిటువంటి ప్రమాదమే సంభవించినప్పుడు, ఆ అడవి ప్రక్కగా పయనిస్తున్న విండుచూలాలు వంటి మేఘాన్ని చూసుకుని, దానిలోకి విరం గురద్వారా దాగి, తుత్తునాగంషాలను పంపటం ద్వారా, ఆ మేఘం వర్షించేలా చెయ్యవచ్చునని సోవియట్ శాస్త్రజ్ఞులు కనుగొన్నారు.

ఈ పద్ధతిలో టైగా అరణ్యంలో ఒక గంటసేపు సకాల వర్షంకురిపించి, 18,000 హెక్టార్లలోని అటవీ సంపద సోవియట్ శాస్త్రజ్ఞులు కాపాడగలిగారు.

## మొట్టమొదట సైకిలును కనిపెట్టిం దెవరు?

ఒక్క భారత దేశంలోనే కాకుండా, ప్రపంచమంతట్లోనూ సామాన్య ప్రజలందరికీ అందుబాటులో వున్న ప్రయాణ సాధన మేమిటి?



సైకిలు! వయోభేదం లేకుండా పిన్నలూ, పెద్దలూ, అందరూ సైకిలు వాడుతారు. అయితే అలాంటి యీ సైకిలును ప్రపంచంలో మొట్టమొదట ఎప్పుడు, ఎవరు కనిపెట్టారో తెలుసా?

ఉరల్‌కు చెందిన అర్టామనోవ్ అనే కార్మికుడు 1800 లో ప్రపంచం మొత్తంమీద మొట్టమొదటి సైకిలును కనిపెట్టాడు.

— 'రాజేష్'

సార్లు చెప్పారు - చదువుకో - ఏమైనా పరీక్షలు కట్టి ప్యాసవు అని."

"అదృష్టవంతురాలివి"—వెంటనే అంది పద్మ తనని ఎవరూ అలా అనేవారు లేకపోయారు గదా అనుకుంటూ—

"పూర్తిగా విను-నేను ముందు ఆశ్చర్యపోయా! నా అదృష్టానికి నేనే పొంగిపోయా—యింత మంచి భర్త నాకు దొరకేరా అని."

"నిజం కాదేమిటి?" సందేహ మేమిటన్న స్వరంతో అడిగింది పద్మ.

"నీకు అలానే అనిపిస్తుంది. నువ్వు నీ యిష్టం వచ్చినట్టుండు. నేను నా యిష్టం వచ్చినట్టు వుంటాను. ఒకరి విషయాల్లో మరొకరు జోక్యం కల్పించుకుని సంసారంలో అశాంతికి కారకులం కాకుండా వుందాం" అన్నారు ఆయన. అలాగే నేను చేసేవాటిని "ఏమిటవి"గాని, "ఎందుకని" గాని ప్రశ్నించేవారు కారు; నా అంతగా నేను చెప్తే "అలాగా!" అనేవారు—అంతే—"

"నీ అదృష్టాన్ని నేను జెలసీ ఫీలవుతున్నా" అంది పద్మ.

"ఏమిటా తొందరపాటు-పూర్తిగా వినకుండా. నేను ఆ మాటల్లోని అంతర్యం. అంతరార్థం గ్రహించుకోలేక పోయా." కళ్యాణి గొంతు బొంగురు పోయింది.

ఒకటి, రెండు కన్నీటి బొట్లు కన్పించాయి కళ్యాణి ముఖంపై. పద్మ ఆశ్చర్య పోయింది.

"అదే-యిదేమిటి-కళ్యాణీ" - ఆతృతగా ప్రశ్నించింది.

నువ్వు మెచ్చుకుంటున్నావుగా నా అదృష్టానికి. ఇవి నా సౌభాగ్యానికి నిదర్శనాలు, పద్మా-నీకు తెలియదు. నేను ఆయన మాటల్లోని నిజం తెలుసుకొనే సరికి భయపడి పోయా. మనిషి పాడయి పోవడానికి ఏ దుర్వ్యసన వుండాలో అది వారికి అబ్బింది. అబ్బడమేమిటి' ఆయనకు ముందునుండీ అలవాటేనట ఇహ నాకు సౌఖ్యం మేమిటి చెప్పు" విచారం తొంగి చూస్తున్నాది ఆ మాటల్లో — నిస్పృహ ప్రతి బింబిస్తున్నది.

"నువ్వు మందలించలేక పోయావా? త్రాగుడు మనిషిని నాశనం చేస్తుందని చెప్ప లేక పోయావా?"

పేలవంగా నవ్వి అంది కళ్యాణి-"చెప్పకుండా ఊరుకుంటానా? చెప్పా-ఆయన నాకన్నా ఎక్కువ నీతులు మాట్లాడారు.-ఒకరి విషయంలో మరొకరి జోక్యం కూడదని అనుకున్నాంగా - అన్నారు నవ్వుతూ. దానికి నేనేం బదులు చెప్పేది-చెప్పి చీవాట్లు తినాలి-అవీ అయ్యాయి" కళ్ళు తుడుచుకుంది రుమాలుతో కళ్యాణి.

ఆలోచిస్తూ అంది పద్మ" 'చాలా వింతగా వుంది కళ్యాణీ-ఈ సంగతి. మీ ఆయన-ఎక్కడ తనకు అడ్డు వస్తావేమో నని ముందు నుండే జాగ్రత్త పడ్డారన్నమాట-నీతులు చెప్పి"

'హుం - త్రాగివచ్చి యింట్లో భార్యను కొట్టి యిల్లు నరకం చేసేవాళ్ల ఎందరులేరు - వారికన్నా చాలా నయమేలే! అదే చాలు నాకు. ఈ జన్మకి. మరి యిపుడు నన్నుచూసి జెలసీ ఫీలవుతున్నావా' అంది నవ్వు తెచ్చుకుంటూ కల్యాణి.

పద్మ మౌనంగా ఆలోచిస్తున్నాది. "కల్యాణీ -' ఏదో అనబోయి వూరుకుంది.

కళ్యాణి మాట మార్చింది. 'మీ ఆయన సంగతి చెప్పు మరి - నాకు తెలుసు నువ్వు -"

నిట్టూరుస్తూ అంది పద్మ "ఏమిటి తెలుసు - ప్రిన్సిపాల్ పులుసు. నన్ను చదవద్దన్నారు. నేను చదవడంవల్ల ఆయనకు అశాంతి కల్గుతుందట - తుంటకొడితే పళ్ళు రాలేయని."

"నాకు అర్థంకావడం లేదు - అసలు విషయం ఏమిటో సరిగ్గా చెప్పు".

ఆరోజు తన చదువు గురించి జరిగిన వివాదమంతా చెప్పింది పద్మ (ప్రాణ) స్నేహితురాలైన కల్యాణితో.

'నువ్వు చాలా తొందరపడ్డావు పద్మా. ఆయనలోని మంచితనం నీకు యింకా ఎందుకు అర్థం కాలేదో నాకు బోధపడటంలేదు. నీకు యింత మంచిభర్త దొరికాడా అని నేను యిపుడు జెలసీ ఫీలవుతున్నాను. "నిజమే! సంసారం సుఖంగా గడియడానికి నీ చదువు ఆటంకంఅని తోచినపుడు అది ఆపేస్తే ఏం?" జీవితంలోని కష్టసుఖాలు అపుడే చవిచూసిన కల్యాణి అంది.

ఈ రెండింటి సారం తెలియని పద్మ "నువ్వు యిలా మాట్లాడుతున్నా వేమిటే?" అంది.

"అవును పద్మా, నీ కిష్టంలేని పని ఆయన చేస్తే అది మాన్పించాలని నువ్వు అనుకుంటావా? అనుకోవా?"

"అవును, అనుకుంటాను."

"ఇంకేం మరి! ఎలా అయితే ఆయన దగ్గర నుండి నువ్వు కొన్ని హక్కులు పొందుతున్నావో-అలాగే ఆయన సంగతి కూడా అంతేకదా? మరి అలాంటపుడు నీవు చదువు మానడానికి ఏమిటి ఆటంకం, దీని విషయమై ఆయనతో అలా వాదించడం చాలా తప్పు పని పద్మా. వెంటనే వుత్తరం వ్రాయి—జరిగినదానికి క్షమాపణలు చెప్పుకుంటూ!" అని సలహా యిచ్చింది కళ్యాణి.

ఆలోచిస్తూ అంది పద్మ "నిజమా - కళ్యాణీ! నాది తప్పా?"

"అవును-వెంటనే వుత్తరం వ్రాయి."

"ఏం వ్రాయను? ఆయన యివాళ వుత్తరం వ్రాశాడు. యిది చూసి చెప్పు ఏం వ్రాయాలో-"

వుత్తరమంతా చదివింది కళ్యాణి-"నీ తొందరపాటు అర్థమయిందా, నీ అసహనంతో ఆయన సహనాన్ని పాడుచేశావు."

"ఆ వుత్తరంలోని మాటలు నాకు సరిగ్గా అర్థం కావడంలేదు" అంది పద్మ.

"నేను చెప్పేకన్నా నిన్ను-నువ్వు ప్రశ్నించుకో-తెలుస్తుంది" అని చెప్పి, లేచి, బయల్దేరబోయింది కళ్యాణి.

"అదేమిటి అపుడే వెళ్ళిపోతున్నావ్ యీ విషయం యిలా మధ్యలో వదిలేశావేమిటి?" లేచి నిల

# న్యాయం మనుగడ

న్యాయాన్నంతటిని —
పుస్తకాల పుటల్లో అచ్చుగుద్ది
చట్టానికి అంకితం అని—
రాజకీయానికి చేరువయితే
చట్టానికి చుట్టమయి
సిఫార్సుల సిరిసంపదల్లో
న్యాయం — సౌమ్యంగా వుంటుంది!!
నిజంగా! న్యాయం వెర్రిదయ్యింది
కటకటాల నీడలో—
చీకటి కాపురం చిగురుస్తోంది!!!
చట్టం—
చదువుకున్నవాడి
గొంతెత్తు-కుత్తుకలో కూలిపోయింది!!
న్యాయం!!
ఏముందని?
న్యాయానికి న్యాయం ఇం కెక్కడుందని?
మునగచెట్టుమీద ఎక్కి-కూర్చుంది
రికమండేషన్ గొంగళి కప్పుకున్నావా?
మరి అప్పుడే! కావల్సినన్యాయం
అనుభవించగలవ్!!!
లేకపోతే—
మునగచెట్టుమీద గుమికూడిన
గొంగళి పురుగులు
కుట్టేస్తాయి!!
కరిచేస్తాయి!!! జాగ్రత్త
తర్వాత ఏమనుకున్నా ఏముంది?
న్యాయాన్ని నమ్ముకున్నా—
చట్టాన్ని చదువుకోలేదు
అందుచే—
న్యాయం! నీలోనే వుండిపోతుంది
సాక్ష్యం చెప్పదు
న్యాయం చట్టం చెప్పాలిగాని
నువు చెప్పితే నమ్మే దెవరు?
అసలే!—
సంఘంలో సగటు మనిషివి
సామాన్యుడివి—
నీలోని నిజాన్ని పట్టించుకొనే దెవరు?

— యార్లగడ్డ ఉమ

బడి వున్న కళ్యాణి చెయ్యి పట్టుకుని అడిగింది పద్మ.

"నేను వెళ్ళాలి. ఇపుడు 3-30 గంటల బండిలో ఆయనొస్తారు. ఇద్దరం కలసి రాత్రి సౌపదా వెళ్లాలి వాళ్ళ స్నేహితుల పెళ్ళికి"

"అయితే మళ్ళీ ఎపుడు కనబడటం"

'మళ్ళీ ఏమిటి - అలా నావడానుండి మాడుకు పోతాం. మళ్ళీకనపడటం ఉత్తరంలో- పద్మా, నీ ఉత్తరంకై వేయికళ్ళతో ఎదురుచూస్తుంటాను. నేను చెప్పింది మరచిపోకు' అని చెప్పి కళ్యాణి తొందరగా వెళ్ళిపోయింది.

వీధి గుమ్మందాకా సాగనంపి మళ్ళీ తన గది లోకి వెళ్ళి మంచంమీద పడుకుంది. కళ్యాణి తనతో మాట్లాడిన మాటలే జ్ఞాపకంవస్తున్నాయి. ఉత్తరంలోని చివరి వాక్యాలు ఆలోచనల్లో ముంచేస్తున్నాయి. మళ్ళీమళ్ళీ చదివింది ఉత్తరం.

'ప్రియ పద్మా——!

నీవు ఈ సరికి మీవాళ్ళను చేరి హాయిగాకాలం గడుపుతుంటావు. ఇక్కడ నేను నా ఖర్మానికి వున్నాను. నీకోవిషయంచెప్పడం మరిచా. నిన్ను మీ నాన్నగారు పంపమన్నారని కాదు నేను పంపించినది. నీవు బయలుదేరే రోజు ముందు రాత్రి జరిగిన మన వివాదం- బహుశా - నీకు జ్ఞాపకముందను కుంటాను.

అయినా అవన్నీ వ్రాయడం అనవసరం! ఒక్క సంగతి జ్ఞాపకముంచుకో! ఏ వ్యక్తి కయినా వివాహంముందు ఎన్నో ఆలోచనలు, ఆశయాలు వుండవచ్చు. కాని వివాహానంతరం అవి సంసార సుఖాన్కి-దోహదమివ్వని పక్షంలో మార్చుకోవాలి. అది ఓటమికి నిదర్శనంకాదు. సంస్కారాన్కి-చిహ్నం. అన్యోన్యానికి- సోపానం.

మనలోని స్వార్థం ఎదుటివారి సుఖాలను దోచుకునేంతటిగా వుండటం అధర్మం.

పద్మా——

భర్తను కాదని ఏ స్త్రీ ఏమీ బావుకోలేదు. నీవు నెలరోజులపాటే కాదు. ఎన్నాళ్ళైనా వుండు. యావజ్జీవమైనా సరే! నేను నిన్ను రమ్మని వ్రాయను. వ్రాసేహక్కు- నాకు లేదు. నీఉద్దేశ్యం కూడా అదే! అంతేకదూ !

ఇట్లు,

మోహన్.

"ఏమిటీ - నేను యిక్కడే వుండిపోవచ్చా! దీని అర్థం?" అని అడిగింది పద్మ తన మనసుని.

మనసు అర్థం విప్పి చెప్పింది. ఒళ్ళంతా చెమటలు పోశాయి. భయంకరంగా కన్పించింది భవిష్యత్తు. ఈ ఆలోచనల్తో రాత్రంతా నిద్ర పట్టలేదు. అమావాస్య జీవితాన్ని వూహించుకోలేక పోతున్నాది పద్మ. తన తెలివితక్కు-వతనం అర్థమవుతున్నాది. తన చిలిపితనం బోధపడుతున్నాది. కాని యిపుడు చేతులు కాలాక ఏం చెయ్యడం? మళ్ళీ మనసుని అడిగింది.

"వెర్రిదానా! నీవు గర్వంగా ప్రవర్తింపవలసినది నీ భర్తదగ్గర కాదు. అణుకువే మగువ లక్షణం. భర్త సౌఖ్యం కోసం నువ్వు ఏ త్యాగమేనా చేయాలి" అని కల్యాణి బోధలతో మారిన మనసు ప్రతి స్త్రీకి పనికివచ్చే జవాబిచ్చింది.

కళ్ళ వెంట నీళ్ళు అప్రయత్నంగా వచ్చేస్తున్నాయి పద్మకు. "నిజమే చేయాలి, అతను చదవద్దన్నారు. మానేస్తాను. మరి ముందు చేసిన పొరపాటు ఎలా దిద్దుకోవడం? అతను తన్ను క్షమించడం ఎలా?" అని తిరిగి ప్రశ్నించింది తన మనసుని పద్మ.

కళ్యాణి యిచ్చిన సలహాయే ఇచ్చింది మనసు - "వెంటనే నీ భర్తకు ఉత్తరం వ్రాయి. చేసిన తప్పు ఒప్పుకో. అందులో తప్పులేదు. క్షమించమని వేడుకో. తెలియక ప్రవర్తించినందుకు మన్నించమని ప్రార్థించు."

ఈ సలహా పద్మకు నచ్చింది. 'నిజమే! మోహన్‌ను వేడుకోవాలి. వుత్తరం వ్రాస్తా. ఎందుకు క్షమించరు, చాలా మంచి ఆయన' అని తనలోతను అనుకొని మర్నాడు వుత్తరంవ్రాసింది.

ఇంట్లో యీ విషయమై ఏమి చెప్పలేదు. వుత్తరం వ్రాసి నాల్గయిదు రోజులయింది. కాని జవాబు యింకా రాలేదు. పద్మ కలవరం ఎక్కు-వవడం ప్రారంభించింది. మొదట్లో వెంటనే జవాబు వస్తుందని ఆశించింది. కాని రాలేదు. ఆలస్యంగా అయినా రాలేదు. బెంగ ఎక్కు-వైంది. ఆవేదన మనసంతా నిండిపోయింది. ప్రతీనిమిషం వుత్తరంకోసం చూడ్డం ప్రారంభించింది. 'మనిషిని చులకనగా చూచానపుడు. ఇపుడు అతను వ్రాయబోయే వుత్తరాన్కి- అమృతంలా ఎదురు చూస్తున్నాను" అని అనుకుంది తనలో. ఇక హృదయం భరించలేకపోయింది ఈ వేదన. మనసులో రగులొ్కంటున్న వేడి వంటిపైకి వచ్చింది. ఆవేళ ఉదయం పద్మ ఒళ్లు ముట్టుకుని కామాక్షమ్మ భయపడిపోయింది. భర్తను పిలిచి చూపించింది. అతను వెంటనే డాక్టరుకోసం వెళ్ళిపోయారు. పద్మ శూన్యంగాచూస్తూ నిశ్చలంగా పడుకుని వుంది. టెంపరేచరు పెరిగినా, తరిగినా తనకేం పట్టనట్టుంది. ఉత్తరంమాత్రం వస్తే బావుణ్ణు. ఇదే ఆలోచన, ఇదే చింత! ఇదే అన్నియును.


"అయ్యో తల్లీ - ఏమిటే అలా పిచ్చిగా చూస్తున్నావే. ఒంట్లో యింత సుస్తీగావుందేమిటి" అని కామాక్షమ్మ వాపోతున్నాది.

డాక్టరు వచ్చి పద్మను చూశారు. ఇంజక్షన్ యివ్వబోతుంటే పద్మ వద్దంది. రాఘవరావుగారు కూడా తీసుకోమని గట్టిగా చెప్పేరు. "వద్దు" అని మంకుపట్టు పట్టింది. పద్మ వైఖరి తల్లిదండ్రులకు అర్థంకాలేదు. డాక్టరుకు సరేసరి।

పద్మ రాత్రీ-పగలు భర్తను గూర్చి కలవరించడం విన్న కామాక్షమ్మ రాఘవరావుగారితో అంది. "ఏమండీ! అల్లుడిపేర వుత్తరంవ్రాయండి అమ్మాయి కలవరిస్తున్నాది" అని.

మర్నాడే ఆయన అల్లుడిపేరన ఎక్స్‌ప్రెస్ డెలివరీ ఉత్తరం వ్రాశారు. పద్మ ఒంట్లో ఏమీ బాగా లేదనీ-తనగురించి బెంగ పెట్టుకుందనీ - మందు కూడా తీసుకోక పోవడం వలన సుస్తీ ఎక్కు-వయిందనీ-కనుక తను వెంటనే రావలసిందనీ - ఏమేమో అంతా వ్రాశారు.

పద్మకు ఈ విషయం తెలిసింది. "వీళ్ళ వెర్రిగాని అతను ఎందుకు వస్తారు. నేను అతని మనసు నొచ్చేలా ప్రవర్తించాను. నన్ను క్షమిం



చడం ఎలా?" అని అనుకుంది మనసులో. కనీసం ఉత్తరమేనా రాదా అని ఆశతో ఎదురు చూసింది కాని రాఘవరావుగారు వ్రాసిన ఉత్తరానికి బదులు ఎప్పుడైతే ఏమీలేదో పరిస్థితులు యింకా విషమించాయి.

కామాక్షమ్మకు ఏమీ చెయ్యడానికి పాలుపోలేదు. "ఇలా అయితే ఎలా అండీ. మీరు వెంటనే బయలుదేరి వెళ్ళి అల్లుణ్ణి తీసుకురండి. అమ్మాయికి జ్వరం పెరిగిందని అన్న లక్షణం లేదు" అని ఏడుస్తూ చెప్పింది భర్తకు.

వెళ్తాను. యివాళ రాత్రే బయలుదేరి వెళ్తాను. కాని ఈ పరిస్థితుల్లో దీన్ని వదలి వెళ్ళడం ఎలా" బాధగా అన్నారు రాఘవరావుగారు.

ఇంతలో ఎక్స్‌ప్రెస్ డెలివరీ ఉత్తరం వచ్చింది. రాఘవరావుగారు తొందరగా సంతకం అయినా చెయ్యకుండా ఉత్తరం జవాను దగ్గర నుండి లాక్కుని చదవడం ప్రారంభించేరు. అతని కళ్ళంట నీళ్ళు వచ్చేశాయి. ఆనందంలో ముఖం నిండిపోయింది.

గౌరవనీయులైన మామగార్కి,

నమస్కారములు. నేను యిన్నాళ్ళయి ఊళ్ళో లేను. క్యాంప్ వెళ్ళాను. ఇవాళే తిరిగి వచ్చాను. మీ ఉత్తరం చూశాను. పద్మ వ్రాసిన ఉత్తరం కూడా యివాళే చూశాను. పరిస్థితులన్నీ అర్థం అయ్యాయి. నేను రేపు వుదయం చేరుకుంటున్నాను మెయిలులో."

ఇట్లు,
మోహన్.

ఉత్తరం విని కామాక్షమ్మ ఆనందంతో "పద్మా!" అని పిలుస్తూ గదిలోకి వెళ్ళింది. అంతా చెప్పింది. అంతావిని పద్మ, అర్థమయి తృప్తిగా నవ్వింది. నీరసం - ఏమీ మాట్లాడలేక పోయింది. "నేను ధన్యురాలిని - నన్ను క్షమించేరు" అనుకుంది తనలో—

రాత్రి రైల్లో ప్రయాణమంతా పద్మ గురించి ఆలోచనలతో అయిపోయింది మోహన్‌కు! పద్మకు తను వ్రాసిన ఉత్తరం యింత పని చేస్తుందనుకోలేదు "ఏమండీ! యిలా వ్రాశారు. నేను తెలియక ఏదైనా తప్పుచేస్తే క్షమించలేరా మీరు? మీరు యిలా కోపంగా వ్రాస్తే నేనేమవాలి." అంటూ పద్మ వ్రాసిన ఉత్తరం మోహన్‌ను ఆశ్చర్యంలో ముంచేసింది. "చాలా మారిపోయిందన్నమాట పద్మ. నాకు తెలుసు. ఆమె మనసు మంచిది. నన్ను ఎప్పటికైనా అర్థం చేసుకుంటుంది. కాని అన్నీ శుభంగా అయ్యేవేళకు ఈ అస్వస్థత ఏమిటి - హే! భగవాన్ నాకు పద్మ కావాలి. కాపాడు" అని ప్రార్థించాడు మోహన్.

స్టేషనుకు రాఘవరావుగారు వచ్చారు. తను వ్రాసిన ఉత్తరం గురించి ఇంట్లో చెప్పేవుంటుంది అనుకున్నాడు మోహన్. "ఏమయ్యా యిక్కడ యావజ్జీవం వుండిపొమ్మని వ్రాస్తావా అమ్మాయికి ఉత్తరం-అసలేమిటి నీ వుద్దేశ్యం" అని మామగారు అడుగుతారేమో కూడా అనుకున్నాడు మోహన్. కాని ఆ వూసే లేదు. కాస్త ధైర్యం వచ్చింది. లేకుంటే ఆమెను మంచి దారిలోకి తేవాలంటే అదే మందు. అందుకే అలా వ్రాశాను" అని చెప్దామనుకున్నాడు యిహ మీదట అడిగినా: కాని ఆ ప్రస్తావనే రాలేదు. తనే పద్మ గురించి ఏమేమో అడగాలనుకున్నాడు. కాని అడగలేకపోయాడు - కాని ఆ ఉత్తరం విషయమే అతన్ని ఆందోళన పెడుతున్నది. ఆఖరికి తనే అడిగేశాడు బండి దిగుతూ యింటిదగ్గర-"పద్మకు ముందు వుత్తరం వ్రాశాను. మీకు ఆ విషయం తెలుసా?" అని. అయన ఆశ్చర్యపోయారు. "పద్మకు వుత్తరం వ్రాశావా! లేదే! అయినా నువ్వు వ్రాస్తే పద్మ మాతో చెప్పదూ" అన్నారు ఆయన.

'బ్రతుకు జీవుడా' అనుకున్నాడు మోహన్. 'నా పద్మ మంచిది. నాకు తెలుసు. చెప్ప దు. ఎవరితో-ఏదీ-నా గురించి యింటిగా చెప్పదు. మారిపోయిందిగా' అనుకున్నాడు తనలో.

ఇంట్లో అడుగు పెట్టగానే డాక్టరు పద్మ గదిలో నుండి బయటకు రావడం చూశాడు - వీరిద్దరూ! నుదుటిమీద చెమట తుడుచుకున్నాడు డాక్టర్. అపరాధ పరిశోధక సినిమాలో వలె వాతావరణం వుంది - ఆ సస్పెన్స్ - అదీ!

అది భరించలేని మోహన్ "ఏం డాక్టరుగారూ? ఎలావుంది?" అని అడిగాడు.

"రాఘవరావుగారూ! మీరోసారి యిటురావాలి" అన్నాడు డాక్టర్.

రాఘవరావుగార్కి భయం ఎక్కువైంది. "ఫరవాలేదు చెప్పండి. ఇక్కడే చెప్పండి" అన్నారు.

"మరేంలేదు. మందు తీసుకుంటేనే జబ్బు నయం అవదు. అటువంటిది మీ అమ్మాయి మందే ముట్టుకోవటం లేదు. మరి —'

"ఆగారేం? చెప్పండి డాక్టర్" అడిగాడు మోహన్. కంఠంలో ఎంతో ఆతృత కనిపిస్తున్నది.

"ఆమె భర్త కోసం కలవరిస్తున్నది. ఆయన్ని వెంటనే రమ్మని టెలిగ్రాం యివ్వండి. అతను వస్తేనా వైద్యం సానుకూలమవుతుంది.

"నిజంగానా?" అన్నారు రాఘవరావుగారు.

"ఔను. అదొక్కటే మార్గం. ఆయన ప్రెజెన్స్ ఎంతయినా అవసరం. లేకపోతే ......"

ఇక ఆగలేక పోయాడు మోహన్.

"లేకపోతే..." మరి విన లేకపోయాడు.

"నేను వచ్చేశాను పద్మా!" అని పద్మ గదివేపు పరుగెత్తాడు.

దైవపూజ చేసుకుంటున్న కామాక్షమ్మ ఆరిపోతున్న ప్రమిదలో నూనె పోసింది.

★

## ఇదీ భారతం

6 వందలమంది అస్సాం పోలీసులు ముగ్గురు సీనియర్ అధికార్ల నాయకత్వాన నాగాలాండ్ రాష్ట్రంలోని మొకొక్‌చుంగ్ జిల్లాలోకి అక్రమంగా ప్రవేశించి వేసోయ్ గ్రామంలోని ప్రజలను చిత్రహింసల పాల్జేశారని, కొంపలు కాల్చి రెండువేల మంది ప్రజలను నిరాశ్రయులను చేశారని నాగాలాండ్ ముఖ్యమంత్రి ప్రకటించారు.

• • •

1969 లో 7 రాష్ట్రాల్లో 22 మత కలహాలు జరిగాయి.

• • •

బీహార్ రాష్ట్రంలో పూర్వపు కె.బి.సహా మంత్రివర్గంలోని ఆరుగురు కాంగ్రెస్ మంత్రులు తమ అధికారాన్ని దుర్వినియోగం చేసి, అవినీతికి అక్రమపక్షపాతానికి పాల్పడినారని అయ్యర్ కమిషన్ నివేదికలో పేర్కొన్నది.

• • •

ఉత్తరప్రదేశ్‌లో హరిజన సామాజిక కళ్యాణశాఖ డిప్యూటీ డైరెక్టరుగారు జితేంద్ర ప్రతాప్‌సింగ్, అంబేద్కర్ హాస్టల్‌కు శంకుస్థాపన చేయడానికి ఆయనను ఆహ్వానించగా హరిజనులు యిచ్చే టీ పుచ్చుకొనడానికి ఆయనగారు నిరాకరించారట.

• • •

జబల్‌పూర్ మెడికల్ కాలేజీనుండి రు. 15 వేల కిమ్మత్తుచేసే మందులు అదృశ్యమైనాయట.

• • •

ఉత్తరప్రదేశ్ రోడ్‌వేస్ ఉద్యోగులు పదివేలమంది ఇతర ప్రభుత్వ ఉద్యోగులకు లభించేవిధంగా శలవులను సంపాదించుకొనడానికి 8 సంవత్సరాలు పోరాటం చేయవలసి వచ్చింది.

• • •

బొంబాయిలోని ఒకమిల్లు ఒక ఇంజనీరు ఉద్యోగం ఖాళీకి ప్రకటనచేస్తే 10 వేల మంది నిరుద్యోగ ఇంజనీర్లు దరఖాస్తులు పెట్టుకున్నారు.